క్లుప్తంగా

మినీ జాతరకు రాజకీయ సెగ

మొగుళ్లపల్లి: మండలంలోని ముల్కలపల్లి-మొగుళ్లపల్లి గ్రామాల మధ్యన ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీకి రాజకీయ సెగ తగిలింది. రాజకీయ నాయకుల జోక్యంతో అనర్హులకు పెద్దపీట వేయడంతో జాతర నిర్వహణ సజావుగా సాగేనా అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1977 సంవత్సరంలో రెండు గ్రామాలకు చెందిన కొంతమంది సభ్యులుగా, డైరెక్టర్లుగా చేరి కొంత రుసుం చెల్లించి సభ్యత్వం పొందారు. నాటి నుంచి నేటి వరకు రెండు గ్రామాలకు చెందిన డైరెక్టర్లు జాతర నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసుకొని వనదేవతలైన జాతర నిర్వహణను ఘనంగా నిర్వహించుకునే వారు. కానీ ప్రస్తుతం ఈ జాతర నిర్వహణకు కొన్ని రోజుల క్రితమే కమిటీ ఏర్పడినప్పటికీ, మండలంలోని కొంతమంది అధికార పార్టీ నాయకులు ఈ కమిటీని కాదని దేవాదాయ శాఖ కమిషనర్‌పై ఒత్తిడి తెచ్చి అనర్హుల పేర్లతో నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నట్లు వారికి వారే ప్రకటించుకున్నారు. దీంతో అర్హులైన కమిటీ డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇట్టి విషయమై అర్హులైన డైరెక్టర్లు దేవాదాయ శాఖ కమిషనర్ అనర్హుల జాబితాతో ప్రకటించిన లెటర్‌తో హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిసింది. ఈ జాతర నిర్వహణ కోసం ఉపయోగించే భూమి ముల్కలపల్లి రెవెన్యూ గ్రామ శివారులో ఉంది. దీంతో రెండు గ్రామాల మధ్యన చిచ్చుపెట్టే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

బస్సును ఢీ కొట్టిన టిప్పర్

కాటారం: మండలంలోని మేడిపల్లి అటవీ ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున బస్సును ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీ కొట్టడంతో కండక్టర్‌తో పాటు డ్రైవర్లు, ప్రయాణికులు తీవ్రగాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భక్తులతో కాటారం మీదుగా మేడారం వెళ్తుంది. ఇదే క్రమంలో భూపాలపల్లి నుంచి బొగ్గు లోడ్ కోసం వస్తున్న టిప్పర్ అతివేగంతో ఎదురుగా వచ్చి బస్సును ఢీ కొట్టింది. దీంతో కండక్టర్ బాలయ్య, డ్రైవర్ ఇస్మాయిల్, స్టెపిని డ్రైవర్ అలీ, పలువురు ప్రయాణీకులకు తీవ్ర గాయాలపాలయ్యారు. బస్సు ఒక వైపు భాగం, టిప్పర్ ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

భక్తుడికి గాయాలు

మేడారం(కాటారం) : మేడారం జాతరకు వచ్చిన ఓ భక్తుడు ట్రాక్టర్ ఢీ కొని తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలు.. కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన రాజు కుటుంబ సభ్యులతో కలిసి ట్రాక్టర్‌లో మేడారం వస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున కాల్వపల్లి-ఊరట్టం మధ్యలో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనం దిగి పరిశీస్తున్న క్రమంలో వెనక నుంచి వచ్చిన ట్రాక్టర్ రాజు కాలుపైకి ఎక్కింది. దీంతో అతని కాలు నుజ్జు నుజ్జయింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు కనీసం భక్తుడికి గాయాలైనప్పటికి పట్టనట్టు వ్యవహరించారు. తోటి భక్తులు రాజును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బొగ్గుల వాగుపై డ్యామ్ నిర్మించాలి

ములుగు రూరల్: బొగ్గుల వాగుపై డ్యామ్ నిర్మించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. రాయినిగూడెం, సర్వాపూర్ గ్రామాల్లో ఎండీ అంజద్ పాషా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు పార్టీలకు సంబంధించిన 15 కుటుంబాలు సీపీఐ పార్టీలో చేరడంతో వారిని రవీందర్ ఆహ్వానించి మాట్లాడారు. పార్టీలో చేరిన వారికి ఎళ్లవేలలా అన్ని విధాలుగా అండదండలు అందిస్తామని అన్నారు. ఈ ప్రాంతంలో అక్టోబర్ తర్వాత వర్షాలు పడని పక్షంలో పంటలు మొత్తం ప్రతి సంవత్సరం ఎండిపోయి రైతులకు నష్టం జరుగుతూనే ఉంది అని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, గుంజ శ్రీనివాస్, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి


మల్లయ్య(ఫైల్)

టేకుమట్ల: విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని వెల్లంపల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కుందనపల్లి గ్రామానికి చెందిన అరకొండ మల్లయ్య(50) గొర్ల కాపరిగా పని చేస్తున్నాడని, రోజువారిలాగే మంగళవారం రాత్రి గ్రామ శివారులో గొర్ల మంద ఏర్పాటు చేసుకున్నాడు. సమీపంలో వెల్లంపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి అనే రైతు అతడి వ్యవసాయ భూమిలోని మొక్క జొన్న పంట వద్ద విద్యుత్ దీపం ఏర్పాటు చేసుకున్న తీగకు మల్లయ్య ప్రమాదవశాత్తు తాకడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతుడి కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా విద్యుత్ తీగను ఏర్పాటు చేసిన రైతు కృష్ణారెడ్డి, రేపాల కొమురయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు.

కొలువుదీరిన సారలమ్మ

రేగొండ: మండలంలోని తిరుమలగిరి శివారులో గల మినీ మేడారం జాతర బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. జెండా గుట్ట నుంచి డప్పు వాయిద్యాల నడుమ కోయ పూజారి సూరటి రాజు సారలమ్మను గద్దె పైకి తీసుకుని వస్తుండగా మహిళా భక్తులు సారలమ్మను ఆవహం చేసుకుని స్వాగతం పలికారు. అనంతరం కోయ పూజారులు సారలమ్మను గద్దె పైన ప్రతిష్ఠించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, ఎత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. నేడు (గురువారం) సమ్మక్క గద్దె పైకి వస్తుండటంతో జాతర సిబ్బంది భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్సీ మధుసుదనాచారి సమ్మక్క సారలమ్మ జాతరను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.


భూపాలపల్లి రూరల్: సారలమ్మను గద్దెపైకి తీసుకువస్తున్న పూజారులు

గ్రామాల్లో మినీ జాతరల సందడి

కాటారం: మండలంలోని గంగారం, దామెరకుంట గ్రామాల్లో సమ్మక్క-సారమ్మల జాతర సందడి నెలకొంది. మేడారంలో మహాజాతర జరుగుతున్న నేపథ్యంలో గంగారం, దామెరకుంట గ్రామాల్లో మినీ జాతర ఏర్పాట్లు చేశారు. ఆనవాయితీ ప్రకారం బుధవారం సారలమ్మను గద్దెలపై ప్రతిష్ఠించగా గురువారం సమ్మక్కను గద్దెలపైకి తీసుకొచ్చి జాతరను వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లోని మిని జాతరను భక్తులు సందర్శించి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు సమర్పించుకుంటున్నారు. మినీ జాతరల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట మినీ మేడారం జాతరలో బుధవారం పూజరులు సత్యనగర్ నుంచి సారలమ్మను పోలీసుల బందోబస్తు మధ్య గద్దె పైకి తీసుకువచ్చారు. సారలమ్మ కొలువుదీరడంతో భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ సారంగపాణి కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలంలోని ముల్కలపల్లి-మొగుళ్లపల్లి గ్రామాల మధ్య నిర్వహించిన మినీ సమ్మక్క-సారలమ్మ జాతరలో బుధవారం సాయంత్రం సారలమ్మ కొలువుదీరారు. జాతర ప్రత్యేక పూజరులు ధనసారి సాంబరావు, గట్టయ్యలు ప్రత్యేక పూజలు నిర్వహించి డప్పు చప్పులతో సారలమ్మకు గద్దెకు తీసుకోచ్చారు.

ఎమ్మెల్యే పూజలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జాతరలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటగా రాజరాజేశ్వరి స్వామికి కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని జాతర కమిటీ సభ్యులకు, అధికారులకు సూచించారు. జాతరలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు భక్తుల కోసం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ జయశ్రీ, కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి పున్నంచందరావు, నడిగొటి రాము, ఎండీ రఫీ, తక్కళ్లపెల్లి రాజు, దండ వెంకటేశ్వర్‌రెడ్డి, కుమారస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.


మొగుళ్లపల్లి: పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గండ్ర



చిట్యాలలో..

వాహనదారులకు పార్కింగ్ ఏర్పాట్లు

భక్తులకు ఎస్సై తీగల మాధవ్‌గౌడ్ తగు సూచనలను చేశారు. పరకాల, చిట్యాల రోడ్ నుంచి వచ్చే వాహనదారులు మొగుళ్లపల్లి రైతు వేదిక వద్ద పార్కింగ్ చేసుకోవాలని, బంగ్లాపల్లి, వేములపల్లి నుంచి వస్తున్న వాహనదారులు పెద్దవాగు పక్కన నిర్దేశించిన స్థలంలో పార్కింగ్ చేసుకోవాలని, జమ్మికుంట రోడ్ నుంచి వస్తున్న వాహనదారులు ముల్కలపల్లి గ్రామ శివారులో నిర్దేశించిన స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

చిట్యాల: మండలంలోని వెంచరామి శివారులోని పూరేడు గుట్ట వద్ద నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. సారలమ్మ తల్లిని ఓడేడ్ గ్రామం నుంచి భక్తి శ్రద్ధలతో పూజారులు బోనగిరి రాజయ్య, తోట శంకర్‌లు గద్దెకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మొగుళ్లపల్లి: ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగు నీటి సౌకర్యం


రేగొండ: గద్దెకు చేరిన సారలమ్మ


మొగుళ్లపల్లి: సారలమ్మను తీసుకువస్తున్న పూజారులు

వనదేవతలకు ఎత్తు బంగారం


ఎత్తుబంగారాన్ని జోకుతున్న భక్తులు

టేకుమట్ల: కోర్కెలు తీర్చే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా బుధవారం భక్తులు తల్లులకు ఎత్తుబంగారాన్ని సమర్పించేందుకు బారులుదీరారు. మండల కేంద్రంలోని బెల్లం కిరాణాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

బస్ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలి


బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: మండలంలోని వెంచరామి శివారు పురేడు గుట్టలోని మినీ మేడారం జాతరకు వెళ్లే భక్తులు ఆర్టీసీ బస్ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కోరారు. బుధవారం మండలంలోని అందుకుతండా గ్రామంలో ఎమ్మెల్యే జెండా ఊపి బస్సును ప్రారంభించారు. అనంతరం అదే బస్సులో అధికారులు, నాయకులతో కలిసి పురేడు గుట్ట జాతర వరకు ప్రయాణం చేశారు. అనంతరం జాతరలో ఏర్పాటు చేసిన హైమాస్ సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులకు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ, మండల స్పెషల్ ఆఫీసర్ ఎల్. విజయలక్ష్మి, ఎంపీడీడిఓ రామయ్య, ఎంపీఓ రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ శివతేజ్, పీఆర్ ఏఈ తిరుపతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు ముకిరాల మధువంశీ కృష్ణ, చిలుకల రాయకొమురు, దొడ్డి కిష్టయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రాజ్‌మహ్మద్, మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శి గడ్డం కొంరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం


తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈఓ రఘుపతి

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని తెలుగు ఉపాధ్యాయుడు గడ్డం శంకర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ కొడెపాక రఘుపతి హాజరై మాట్లాడుతూ.. మధురమైన మాతృభాష మన తెలుగును మనం కాపాడుకుంటే మనల్ని మనం కాపాడుకున్నట్టేనని అన్నారు. అలాగే మన సంస్కృతి సంప్రదాయాలను కూడా రక్షించబడుతాయని తెలిపారు. మాతృభాషేయే ఇతర భాషాల అధ్యాయానికి పునాది అవుతుందని పేర్కొన్నారు. అనంతరం పాటలు, నృత్యాలు, కవితలు, పద్యాలు, కవి పరిచాయాలు, చిత్రలేఖనాలతో అకట్టుకున్న విద్యార్థులందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజమౌళి, సరళ, నీలిమా, కల్పన, ఉస్మాన్‌అలీ, బుజ్జమ్మ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రబృందం

టేకుమట్ల: మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన దానవేని రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మృతుడితో కలిసిన 2000ల సంవత్సరంలో పదో చదువుకున్న బాల్య మిత్రబృందం బుధవారం పరామర్శించి రూ.25వేలను ఆర్థిక సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో దాసరి కుమారస్వామి, వంగ నరేష్, ఎండీ రహీమ్ పాషా, బండి కుమార్, ఊరుగొండ కిషన్, కాసాని మహేందర్, బైరి రాజు, కాలాస మహేందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

వనదేవతల ఆశీస్సులు ఉండాలి


మొగుళ్లపల్లి: మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి


చిట్యాలలో..

మొగుళ్లపల్లి: వనదేవతలైన సమ్మక్క-సారలమ్మల ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి వేడుకున్నారు. బుధవారం ముల్కలపల్లి-మొగుళ్లపల్లి గ్రామాల మధ్యన నిర్వహించిన జాతరలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, ఎంపీపీ యార సుజాత-సంజీవ రెడ్డి, దానవేని రాములు, పెంతల రాజేందర్‌రెడ్డి, అరవింద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని వెంచరామి శివారు పూరేడు గుట్ట వద్ద శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను బుధవారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నిరకాల వసతులు కల్పించాలని కోరారు. తాము అధికారంలో ఉన్న సమయంలోనే సంపూర్ణంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పెరుగుతున్న భక్తులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న నాయకులు మరిన్ని శాశ్వత పనులు చేపట్టాలని కోరారు.

నాపాక ఆలయ అభివృద్ధి కృషి..

మండలంలోని నైన్‌పాక గ్రామ శివారులో శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి (నాపాక) ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. అనంతరం నాపాక అలయంలో పూజలు నిర్వహించారు. ఆయన వెంట టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, నాయకులు చింతల రమేష్, పుల్లూరి సతీష్, సంగ రాజేందర్, కచ్చు శ్రీనివాస్, మల్లేష్, కుమారస్వామి, బొమ్మ శరత్ , సిద్దంకి భాస్కర్, నందు నాయక్, యుగేందర్, రాజ్ నాయక్, కిరణ్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



టేకుమట్ల: కుక్కల దాడిలో బాలుడికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన మాచర్ల విహాన్(2) అనే బాలుడు ఇంటి ముందు ఆడుకుంటున్న క్రమంలో కుక్కలు బాలుడిపై మూకుమ్మడిగా దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరమడంతో బాలుడిని వదిలి పెట్టాయి. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డ బాలుడిని వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్సనందిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు గుంపులు, గుంపులుగా చేరి పిల్లలను, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, కావున కుక్కలను నియంత్రించేందుకు అధికారులు, చొరవ తీసుకోవాలని పలువురు అధికారులను కోరుతున్నారు.